ప్రజాశక్తి
సోమవారం 20, మార్చి 2023

23 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ

డిఇఒ ఎం.సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా విద్యార్థులకు వారంలో మూడు రోజులు అల్పాహారంగా రాగిజావ అందించే కార్యక్రమాన్ని ఈనెల 23న ప్రారంభించనున్నట్లు అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రాగిజావ తాగేందుకు గ్లాసులను కూడా ప్రభుత్వమే సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం సరఫరా చేసే గ్లాసులు వచ్చే వరకూ రాగిజావ తాగేందుకు మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులే తమ ఇళ్ల నుంచి గ్లాసులు తీసుకొచ్చే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.

టిడిపిలో నూతనోత్సాహం..

పట్టభద్రుల గెలుపుతో ఉత్తేజం

వైసిపిలో అంతర్మథనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీలో నూతనోత్తేజాన్ని నింపాయి. 2019 సార్వత్రిక ఎన్నికల నుంచి వరుసగా పరాజయాలనే చవిచూస్తూ వచ్చిన టిడిపి ఈ ఎన్నికలు ఒక ఔషధంగా పనిచేయనున్నాయి. గతంలో ఎన్నడూలేనంతగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమిని చవిచూసింది. హేమాహేమీలనుకున్న వారుకూడా ఓటమి చెందారు. ఎప్పుడూ టిడిపికి కంచుకోటగా ఉండే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంత ఘోర ఓటమిని గతంలో ఎన్నడూ చవిచూడలేదు. 14 అసెంబ్లీ స్థానాలుంటే 12 వాటిల్లో ఓటమి చెందింది. ఉరవకొండ, హిందూపురం అసెంబ్లీ స్థానాలు మినహా తక్కిన అన్ని చోట్లా ఓడిపోయింది. ఓటమే ఎరుగని కుటుంబంగానున్న జెసి కుటుంబం కూడా ఈ ఎన్నికల్లో ఓడిపోయింది. అటు తరువాత జరిగిన పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు అన్నింటిలోనూ ఘోరంగా ఓడిపోయింది. జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీ మినహా తక్కిన అన్ని మున్సిపాలిటీల్లోనూ వైసిపినే గెలుచుకుంది. జిల్లా పరిషత్‌లో ఒకే ఒక్క సభ్యుడి మాత్రమే అడుగు పెట్టగలిగాడు. ఇంత తక్కువ సంఖ్య జిల్లా పరిషత్‌లో ఉన్నది ఇదే ప్రథమం. ఇంతటి ఘోర ఓటములతో ఆ పార్టీ క్యాడర్‌లోనూ ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది రాబోయే సార్వత్రిక ఎన్నికలను ఏ రకంగా ఎదుర్కొనగలదన్న సందేహాలు లేకపోలేదు. వచ్చే ఎన్నికల్లో ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు ఆ పార్టీ దిగువ స్థాయి నేతల్లోనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరిగిన మండలి ఎన్నికల్లోనూ ప్రారంభంలో అంతటి ఉత్సాహం కనిపించలేదు. వైసిపిని తట్టుకుని ముందుకు పోవడం సాధ్యమా అన్న సందేహాలను ఆ పార్టీ ముఖ్య నాయకుల్లోనూ కనిపించింది. అయితే బరిలో నిలిచి కొంత వరకైనా సత్తా చాటితే చాలన్నట్టుగా ప్రారంభమైంది. అయితే ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తరువాత వస్తున్న ఓట్లు చూసి ఆ పార్టీ నాయకుల్లో నూతనోత్సహం మొదలైంది. కౌంటింగు ముందుకు సాగుతున్న కొద్దీ, విజయవకాశాలు మెరుగుపడుతున్న కొద్దీ నాయకులు మరింత ఉత్సహంగా కౌంటింగు కేంద్రం వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. చాలా కాలం తరువాత ఎన్నికల ద్వారా వస్తున్న ఫలితాలు చూసి రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఇదే ట్రెండు కొనసాగే సూచనలున్నాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర జిల్లాలో ప్రారంభమవడంతో ఈ ఉత్సహం మరింత పెరిగినట్టు కనిపిస్తోంది. ఇది ఇలాగుంటే వైసిపిలో ఇప్పటి వరకు ఎదురులేదన్నట్టుగా ఉంటూ వచ్చిన నాయకుల్లో ఫలితాలు అంతర్మథనం మొదలైంది. ఎన్నికల కౌంటింగులో అధికారులు టిడిపి

పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయంతో గుంతకల్లులో సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

అనుకూలంగా వ్యవహరించారంటూ ఆరోపణలు చేస్తున్నారు. ఇవి చేస్తున్నప్పటికీ లోలోన మాత్రం ఎక్కడో తేడా వస్తోందన్న సందేహాలు, గుబులు మాత్రం నేతల్లో మొదలైంది. వాస్తవానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ప్రచార సమయంలోనే వైసిపి ముఖ్య నాయకులకు ఈ అంశం బోధపడింది. అయితే తమకున్న అధికార బలంతో ఏదో రకంగా గట్టెక్కవచ్చునని భావించారు. అందుకు అనుగుణంగా ధన బలాన్ని కూడా ఉపయోగించారు. ఇతర అభ్యర్థులెవరూ డబ్బులు పంపిణీ కూడా చేయకపోవడంతో ఇక తమ విజయం సులువు అవుతుందని భావించారు. పట్టభద్రులకు ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ డబ్బు ప్రభావంతో విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. కానీ ఫలితాలు చూశాక వారికీ అసలు వాస్తవం బోధపడుతోంది. డబ్బు ప్రబావం ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయలేదని, ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా ప్రజల్లో ఉందన్నది స్పష్టమవుతోంది. అయితే సంక్షేమ పథకాలు ఇంత పెద్దఎత్తున అమలు చేస్తున్నా, ప్రజల్లో ఎందుకు అసంతృప్తి ఉందన్నది మాత్రం గ్రహించలేకపోతున్నారు. ఈ ఫలితాలు ఏ రకంగా అర్థం చేసుకోవాలో పాలుపోని పరిస్థితుల్లో వైసిపి నేతలున్నారు.

మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఐద్వానాయకులు

పోరాట స్ఫూర్తి మల్లు స్వరాజ్యం

ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో బాని సత్వం, వివక్ష, దౌర్జన్యం, దోపిడీ వ్యవస్థ రూపుమాపేందుకు, సమానత్వం కోసం మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చేసిన పోరాటాలు సమాజానికి స్ఫూర్తిగా నిలిచాయని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి కార్యక్రమం గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, విజ్ఞాన్ విశ్వం విజ్ఞాన కేంద్ర కన్వీనర్ ఎజి.రాజమోహన్, ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రదాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి తదితరులు హాజరై మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం చూపిన పోరాట స్ఫూర్తి, ధైర్య సహసాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. మహిళ అయినా ఎన్నో నిర్బందాలు, అరెస్టులు, ఎదుర్కొని మహిళలను పోరాటంలోకి తీసుకొచ్చేందుకు చైతన్యం కల్పించారని తెలిపారు. తుది శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన నిబద్ధత, నిజాయతీ, నీతి నియమాలు అనుసరించిన గొప్ప నాయకురాలు స్వరాజ్యం అన్నారు. ఆమె ఆశయాలు సాధించడం కోసం కృషి చేయడమే మనం ఇచ్చే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నగర కార్యదర్శి చంద్రిక, సంయుక్త కార్యదర్శి రామాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్ కాలనీలో పేదలు గుడిసెలు వేసుకున్న సిపిఎం కాలనీలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, బాబు, నాగభూషణం, మోహన్, శివ, షరీఫ్, ఐద్వా నాయకులు లతా, ఆదిలక్ష్మి, లాలమ్మ, సునీత, వెంకటలక్ష్మి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీకి కార్మిక, కర్షకులు తరలివెళదాం

జీపు జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

అనంతలో కార్మిక , రైతు జీపు జాతా ప్రారంభం

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ, మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆశా, అంగన్‌వాడీ, మహిళా, యువత, విద్యార్థులందరూ తరలి వెళ్లి జయప్రదం చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక, మహిళా, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపడుతున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో చేపట్టిన జీపుజాతాను జెండా ఊపి ప్రారంభించారు. టవర్ క్లాక్ సర్కిల్ వద్ద నిర్వహించిన జీపు జాతాకు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హాజరై ప్రాంభించారు. అంతకు మునుపు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించని దుస్థితి నెలకొందన్నారు. అత్యంత ధనవంతులైన ఆదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతూ దేశ రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా ఉండేందుకు మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రయివేట్ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు బదులుగా ప్రజానుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక, పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, డైలీవేజ్, గౌరవ వేతనం తదితర కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. జిల్లాలో సోలార్ విద్యుత్ పేరుతో అదానీ కంపెనీకి వేల ఎకరాలు అప్పగించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధానాలపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. విద్యా వంతులు, మేధావుల ఎన్నికల్లో ఘోరంగా ఓడించి చెంపపెట్టులా హెచ్చరించారని తెలిపారు. మోడీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు చాలా బాధాకరమని అన్నారు. మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ చేపడుతున్నట్లు తెలిపారు. అందరినీ చైతన్య పరిచి పోరాటంలో భాగస్వాములను చేయడం కోసం జీపు జాతా చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, వ్యవసాయ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సూరి, శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, గ్రామ పంచాయతీ ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్, సిఐటియు నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ, తిరుమలేష్, రామాంజనమ్మ, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు జీపు జాత చేసిన గ్రామాలు

కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక, కర్షకుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన జాపు జాతా తొలి రోజు అనంతపురం టవర్ క్లాక్ సర్కిల్ నుంచి ప్రారంభమయింది. బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరుకు చేరుకుంది.

గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు అమానుషం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, స్కీం వర్కర్‌ల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఛలో అసెంబ్లీ తలపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్‌లను పోలీసులతో గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులకు పాల్పడటం దుర్మార్గంగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. కార్మిక సంఘాల నేతలను గృహ నిర్బంధాలకు గురి చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడటం అమానుషంగా ఉందన్నారు. విద్యా వంతులు, మేధావులు శాసనమండలి ఎన్నికల్లో గుణపాఠం నేర్పినా రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మారకపోవడం విచారకరం అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, కార్మికులు, రైతులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ఆనావాయితీగా వస్తోందన్నారు. అలాంటి కనీసం సమస్యలను తెలిపే స్వేచ్ఛను కూడా రాష్ట్ర ప్రభుత్వం హరించేలా వ్యవహరిచడం సరికాదన్నారు. పోలీసులతో ఎంతో కాలం పరిపాలన చేయలేరని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి విధానాలు మంచిది కాదన్నారు.

రోడ్డు నిబంధనలతో ప్రమాదాల నివారణ

కరుణసాగర్ రెడ్డి, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్, శ్రీ సత్యసాయి జిల్లా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ కరుణసాగర్ రెడ్డి తెలిపారు. రహదారి నియమ నిబంధనలు పాటించకపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురై ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం కూడా జరుగుతోందన్నారు. నిత్యం ఏదో ఒక చోట వాహన ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అజాగ్రత్తే దీనికి కారణంవాహన డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, యువత అతివేగంతో జాగ్రత్తలు పాటించకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ కరుణసాగర్ రెడ్డి ఆదివారం ప్రజాశక్తి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : మీ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను వివరిస్తారా ?

జవాబు : వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయడం, వాహనాల తనిఖీ, వాహనాల ఫిట్‌నెస్, పన్నులు వసూలు చేయడం ముఖ్యమైన అంశాలన్నారు. తమ సిబ్బంది తరచూ వాహనాలను తనిఖీలు చేయడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్ లేకున్నా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా అపరాధ రుసుము వసూలు చేస్తాం. అన్ని సవ్యంగా ఉంటే ఎలాంటి సమస్య ఉండదు.

ప్రశ్న : కొన్ని హెవీ వాహనాల్లో ముఖ్యంగా లారీలలో సిమెంటు రాయి అక్రమంగా కూడా తరలిస్తుంటారు? వాటిపై చర్యలు ఏమిటి?

జవాబు : ఆ వాహనాలకు లైసెన్సులు ఉంటే సమస్య ఉండదు. కొన్ని వాహనాలు అక్రమంగా అడ్డదారుల్లో దొంగచాటుగా రవాణా చేస్తుంటారు. అలాంటి వాహనాలకు అపరాధ రుసుము విధిస్తాం. ఆ వాహనాల ఫిట్‌నెస్ పాటించకుండా ఉంటే కూడా అపరాధ రుసుము వసూలు చేస్తాం. కొందరు ఇవేవీ లేకుండా దొంగగా ఏ అర్ధరాత్రి పూటో లేక దొంగ దారుల్లో ఇతర రాష్ట్రాలకు సరుకు తరలిస్తూ ఉంటారు. వాటి పట్ల కూడా అప్రమత్తంగా ఉంటూ తమ సిబ్బంది ఆ వాహనాలను పట్టుకుంటూ ఉంటారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉంటాం.

ప్రశ్న : జీవనోపాధి కోసం కార్మికులు నడుపుకుంటున్న ఆటోలపై మీ శాఖతోపాటు పోలీసు వారు దాడులు చేస్తూ అపరాధ రుసుము వేస్తున్నారన్న అభియోగం ఉంది ? మీరేమంటారు?

జవాబు : ఎవరి మీదా మాకు కక్ష లేదు. వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాటి జోలికి పోము. అంతేగాక పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఈ అంశాలపైనే ప్రధానంగా మా శాఖ గానీ, పోలీసులు గానీ చెకప్ చేస్తుంటారు. డీజిలు ఆటోలో అయితే ఐదుగురు, చిన్న ఆటో అయితే ముగ్గురు లేదా నలుగురు ప్రయాణికులను తీసుకెళ్లవచ్చు అంతకుమించి తీసుకెళ్తే కేసులు, అపరాధ రుసుము విధిస్తాం. అన్నీ కరెక్టుగా ఉంటే ఏ సమస్యా ఉండదు.

ప్రశ్న : రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా, లైసెన్స్ పొందాలన్నా బ్రోకర్ల హవా జరుగుతోందని అంటారు. మీరేమంటారు?

జవాబు : ఆ విధానమే ఇప్పుడు లేదు. అంతా మీ సేవలో సచివాలయాల్లోనే పనులు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ సిస్టం వచ్చిన తరువాత బ్రోకర్ల మాటే ఉండదు. వాహనాల రిజిస్ట్రేషన్ వాహన విక్రయ డీలర్ల వద్దే జరిగిపోతుంది. కాబట్టి బ్రోకర్ల మాటే ఉండదు. హిందూపురంలోని మా కార్యాలయంలో మరో రెండు నెలల లోపు ప్రతిదీ ఆన్‌లైన్ సిస్టం లోకి తెస్తున్నాం. ఏ విషయానికైనా ప్రజలు నేరుగా మా శాఖ అధికారులను కలవచ్చు.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జవాబు : సిబ్బంది కొరత లేదు. నలుగురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందే వారు నేరుగా తమను సంప్రదించవచ్చు. అతివేగం ప్రమాదకరం. ట్రాఫిక్ నిబంధనలను వాహన చోధకులు తప్పనిసరిగా పాటించాలి. అప్పుడే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

జగన్ ప్రభుత్వంలో పక్క రాష్ట్రాలకు వెళ్తున్న పరిశ్రమలు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-నల్లచెరువు

జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలని ఏర్పాటు చేయడం మాట అటుంచి ఉన్న పరిశ్రమలను వేరే రాష్ట్రాలకు తరుముతున్నాడని, కమీషన్ల కోసం వేధిస్తున్నాడని నారా లోకోష్ దుయ్యబట్టాడు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 47వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం మీదుగా సాగింది. ఆదివారం నల్లచెరువు మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ చిన్నపల్లోల్లపల్లి విడిదికేంద్రం నుండి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున లోకేష్‌కు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారథి, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ, మాట్లాడుతూ ముందుకు నడిచారు. దేవిరెడ్డిపల్లిలో స్థానిక సర్పంచి హర్షవర్ధన్ నాయుడు లోకేష్‌కు గజమాలతో స్వాగతం పలికారు. తదుపరి పెద్దయల్లం పల్లి వద్ద మహిళలు పురుషులు, పిల్లలు జాతీయ రహదారిపై లోకేష్‌కు మంగళహారతి ఇచ్చి బాణాసంచా కాల్చి ఆహ్వానం పలికారు. సంజీవిపల్లి వద్ద ఆయన స్థానికులతో మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాట్నాలపల్లి వద్దకు చేరుకున్న లోకేష్‌కు కురుబ కులస్తులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. చిన్న ఎల్లంపల్లి వద్ద పాదయాత్ర 600 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం జోగన్నపేట వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలని ఏర్పాటు చేయడం మాట అటుంచి ఉన్న పరిశ్రమలను వేరే రాష్ట్రాలకు తరుముతున్నాడని, కమీషన్ల కోసం వేధిస్తున్నాడని దుయ్యబట్టాడు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 90 శాతం హంద్రీనీవా పనులు పూర్తి చేశామని మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేసి సాగునీరు అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగం కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. శాసనసభలో ఎమ్మెల్యేలు ఓ మహిళ అని చూడకుండా తన తల్లిని తిట్టారన్నారు. తాను ఏనాడూ మహిళలను కించపరిచేలా మాట్లాడలేదన్నారు. వారి విమర్శలకు తన తల్లి నెల రోజులు బాధపడిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వారికి తగిన బుద్ధి చెబుతానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'యువగళం'లో మాట్లాడుతున్న నారా లోకేష్

స్థానిక ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు..

కదిరి ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డిపై లోకేష్ ఘాటు విమర్శలు చేశారు. కదిరిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానని, బైపాస్ రోడ్డు తెస్తానని, హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేశాడన్నారు. లక్ష్మీనరసింహస్వామి కోనేరు అభివృద్ధి పేరుతో నిధులు మింగాడని విమర్శించారు. నియోజక వర్గంలో రూ.50 వేలు పైబడి ఏ కాంట్రాక్టు అయినా తన బంధువులకు ఇప్పించుకుంటాడని ఆరోపించారు. ప్రభుత్వానికి సంబంధించిన అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటాడని తెలిపారు. ఎన్‌పి.కుంటలో వెలసిన సోలార్ ప్రాజెక్టు 9 ఏజెన్సీల నుండి దాదాపు రూ.8 కోట్లు వసూలు చేశాడని అన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయరు కానీ స్థానిక ఎమ్మెల్యే తన అపార్డుమెంటుకు మాత్రం రూ.50 లక్షలతో రోడ్లు మాత్రం వేసుకున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, గాలివేటి కృష్ణమోహన్ నాయుడు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ, కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి - సిఐటియు, రైతుసంఘం, వ్యకాసం నాయకులు

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక హక్కులను కాలరాస్తోందని సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, బీహెచ్ రాయుడు విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన జీపుజాతా ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలు విడదీసి పాలిస్తోందన్నారు. అంతేగాకుండా అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం బాధాకరమన్నారు. వెంటనే కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీ, ఆశా వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి సంవత్సరానికి 200 రోజుల పనులు, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి 19 నుంచి 26వ తేదీ వరకూ చేపట్టిన జీపుజాతాను జయప్రదం చేయాలని కోరారు. అలాగే కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు శీన, డివైఎఫ్ఐ నాయకులు నరసింహులు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎపి రైతుసంఘం, వ్యకాసం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా ఆదివారం మండల కేంద్రం మీదుగా సాగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ముఖ్యంగా అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీల సేవలో మునిగి తేలుతోందన్నారు. ప్రజలు, కార్మికుల కోసం రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంకన్న, రైతుసంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసులు, ఓబులేసు ప్రభాస్, రాజేష్, నాగరాజు, నల్లప్ప, ఎర్రిస్వామి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో మాట్లాడుతున్న నాయకులు

పుట్లూరు : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతుసంఘం నాయకులు విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన జీపుజాతా ఆదివారం మండలంలో సాగింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం వీడిన గాలివానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా కార్పొరేట్లు అంబానీ, అదానీలకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను కూడా పేదలకు లేకుండా చేసేందుకు కుట్రలు చేయడం బాధాకరమన్నారు. ప్రజా అనుకూల విధానాల సాధన కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో అత్యధిక మంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, సిఐటియు జిల్లా నాయకులు శీన, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రైతుసంఘం ఉపాధ్యక్షుడు వీటీ రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, నాగ మునేంద్ర, యల్లనూరు మండల కార్యదర్శి ఓబులేసు, నాయకులు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన జీపుజాతా ఆదివారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా రైతు సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతు, ప్రజల సమస్యలను మరింత పెంచిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ సేవలో మునిగితేలుతోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజా సానుకూల విధానాల సాధన కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక - కర్షక పోరాట ప్రదర్శనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం, కౌలు రైతు, సిఐటియు నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, నరసింహారెడ్డి, రాజారామిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్, హనుమంతురెడ్డి, చంటి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

తాడిపత్రిలో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

మృతిచెందిన కార్మికుడు తిరుమలనాయక్ (పాతచిత్రం)

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని అక్కన్నపల్లి గ్రామంలో విద్యుత్ లైన్ మరమతులు చేస్తుండగా షాక్‌కు గురై తిరుమల నాయక్ (28) మృతిచెందాడు. రూరల్ పోలీసులు వివరాల మేరకు.. విజయనగర్ కాలనీకి చెందిన తిరుమలనాయక్ విద్యుత్ స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేసే ప్రవేట్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా అక్కన్నపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ ఉద్యోగి అచ్చప్ప తన ఏరియాలో విద్యుత్ లైన్లు రిపేరు చేయాలని ఆదివారం ఉదయం తీసుకెళ్లాడు. పొలాల్లో విద్యుత్ పోల్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయ్యి షాక్ గురై కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

25న మహిళా సాధికారత సదస్సు

రాయదుర్గం : రాయదుర్గంలోని సీతారామాంజనేయ సత్రంలో మహిళా సాధికారతపై ఈనెల 25న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ ఫక్కీరప్పతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా పట్టణంలోని దశభుజ మహాగణపతి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 25న జరిగే మహిళ సాధికారత సదస్సుకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు శేషసాయి, శ్యాంసుందర్, రమేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, తహశీల్దార్ మారుతి, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్, తదితరులు ఉన్నారు.

సద్దకూటి వెంకటరామిరెడ్డికి నివాళి

ఆత్మకూరు : వైసిపి మద్దతుదారుడు, టెక్నికల్ అసిస్టెంట్ సద్దకూటి వెంకటరామిరెడ్డి మృతి తీరనిలోటని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు వెంకటరామిరెడ్డి మృతదేహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పంపనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరామిరెడ్డి మృతిచెందడం బాధాకరమన్నారు. ముందుగా ప్రమాద స్థలాన్ని పరిశీలించి ఘటనపై స్థానిక నాయకులతో ఆరాతీశారు. అనంతరం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో సరస్వతి పూజ

అనంతపురం : ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఎజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరస్వతీ దేవి కటాక్షం లభించాలంటే ప్రతి విద్యార్థి కష్టపడుతూ చదువుల తల్లి సరస్వతీదేవిని స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లుతబస్సు, సమీనా ఖానం, విశ్వనాథ్, పర్వీన్, నేత్రావతి, శాంతా, శ్రీదేవి, డీన్లు రిషిబాల, అప్పలనాయుడు, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ, ఏవో గోపాల్, క్యాంపస్ ఇన్‌ఛార్జి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలకు నిధులు కేటాయించాలని వినతి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ : నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కలిసి విన్నవించారు. ఆదివారం మంత్రి నివాసంలో ప్రత్యేకంగా కలిసి నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల వసతి సౌకర్యార్థం 25 గదులు, 4 సమావేశ భవనాలు కలిపి రెండంతస్తులు డార్మెంటరీని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిర్మించాలని గతంలోనే విన్నవించామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె నియోజకవర్గవ్యాప్తంగా 3వరోజు ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల తాగు నీటి పంపుహౌస్, ఉరవకొండ మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల, రాంపురం పంపుహౌస్‌ల వద్ద కార్మికులు నిరసనలు చేపట్టారు. వీరికి సిసిఎంతోపాటు సిఐటియు నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి కార్మికులకు రావాల్సిన బోనస్‌తోపాటు గ్రాడ్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ, బకాయి జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి కార్మికులు చిన్న బాబయ్య, రామాంజనేయులు, హనుమంతురెడ్డి, తిప్పేస్వామి, గంగాధర్, సీనప్ప, సంతోష్, రమేష్, లాలుస్వామి, కిష్టప్ప, యుగంధర్, సిపిఎం నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సత్యసాయి పథకం కార్మికులు

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు..

సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్ హెచ్చరించారు. జీవో-1ని రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ఆదివారం హౌస్‌అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ అరెస్టులు చేస్తూ ఉద్యమాలను అనగదొక్కాలని చూడటం ప్రభుత్వ అవివేకం అన్నారు. ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా రాత్రికి రాత్రి చీకటి జీవోలు విడుదల చేస్తూ పోలీసుల అండదండలతో వైసిపి ప్రభుత్వం వ్యవహరించడం మంచిది కాదన్నారు.

మధుసూదన్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

గుంతకల్లు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రేష్మా హెచ్చరించారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించేందుకు వెళ్లనున్న నేపథ్యంలో గుంతకల్లు సిఐటియు అనుబంధ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రేష్మాకు ఆదివారం ముదస్తు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా రేష్మా మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఇది నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. అరెస్టులతో ఉద్యమాలు ఆపాలని అనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వానికి అద్దం పడుతోందన్నారు.

మక్కా మసీదు ప్రారంభం

నార్పల : మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న మసీదు కట్టలో నూతనంగా నిర్మించిన మక్కా మసీదును ఆదివారం ఘనంగా ప్రాంభించారు. ఈసందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరలో ప్రారంభం కానున్న రంజాన్ నెలలో నూతన మసీదులో ప్రార్థనలతోపాటు తరవి నమాజు కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం మసీదులో ప్రార్థనలు చేయడంతోపాటు మహమ్మద్ ప్రవక్త చూపించిన ఇస్లాం సూత్రాలను పాటిస్తూ దివ్యగ్రంధం ఖురాన్ పట్ల ప్రత్యేక గౌరవము కలిగి ఉండాలి సూచించారు.

In the Court of the 2nd Addl. Junior Civil Judge: Anantapuramu

O.S.No.301/2018

Between:
B.Savithramma ...Plaintiff
And
G.Sangamma and others ...Defendants

Notice to Defendant No.1 and 6

D1: G.Sangamma W/o Narayana Reddy, Resident of Nagireddy palli Viollage, Anantapuramu mandal.
D6: G.Siva Reddy S/o Late Malli Reddy, Gotukur Village and Post, Kuderu Mandal, Anantapuramu Dist.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 24-03-2023వ తేది ఉదయం 10.30 గంలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎ.రాఘవేంద్ర
వాదిపరం వకీలు, అనంతపురం.

In the Court of the Junior Civil Judge: Anantapuramu

I.A.No.701/2019 O.S.No.154/2017

Between:
E.Chandra MOhan ...Petitioner
And
R.Saraswathi and 2 others ...Respondents
To,
1.R.Nandini D/o Late R.Venkata Naidu
2.K.Tejaswini D/o Late R.Venkata Naidu, D.No.6-1-128/16, Janma Bhumi Road, Anantapuram.

పై దావాలో అర్జీదారుడు మీరు చనిపోయిన ఆర్.వెంకటనాయుడుకు వారసులైనందున మిమ్ములను పై దావాలో ప్రతివాదులుగా చేర్చుటకు గాను అర్జీ దాఖలు చేసియున్నాడు. ఇందులకు మీకేమైన ఆక్షేపణలున్న యెడల పై కోర్టువారి ఎదుట 24-03-2023వ తేది ఉదయం 10.30 గంలకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ తెలుపుకోవచ్చును. లేనంతట మీ పరోక్షము నందు తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

T.RANGA REDDY
Advocate for Petitioner

In the Court of the Junior Civil Judge:Gooty

I.A.No.68/2022 in O.S.No.44/2022

Between:
Lakshmikanthamma and others ...Petitioners/Plaintiffs
And
Banala Madhileti Swamy and another ...Respondents/Defendants

Notice to Respondent No.1&2

R1: Banala Madhileti Swamy S/o B.Chinna Madhileti.
R2: Banala Venkataramaiah S/o B.Chinna Madhileti.
Both are Residents of Ubicherla Village, Gooty Mandalam, Anantapuramu Dist.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం 23-03-2023వ తేది ఉదయం 10.30 గంలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

టి.ధనుంజయ
వకీలు, గుత్తి, సెల్:9885896307.

పంటలకు తీవ్ర నష్టం

పరిశీలించిన అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎంపిపి సునీత, జడ్పిటిసి భాస్కర్ తెలిపారు. మండలంలోని రేగడికొత్తూరు, గోవిందంపల్లి, చదుళ్ల, నీలంపల్లి, కొర్రపాడు, రోటరీపురం గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు భారీగా నష్టపోయారన్నారు. 950 మంది రైతులు 1650 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదిక తయారు చేసినట్లు వ్యవసాయ అధికారి వెంకటరాముడు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి శైలజ, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, మసూద్‌వలి, కొర్రపాడు ఉప సర్పంచి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లన్న, నాగ, నారాయణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రుషింగప్ప, గ్రామ వ్యవసాయ సహాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి పర్యంతమైన రైతు

మండల కేంద్రంలోని బోడిగానిదొడ్డి రెవెన్యూ గ్రామ పొలంలో రైతు ఆర్.రంగస్వామి సాగు చేసిన దాదాపు 10 ఎకరాల్లో పంట నష్టం జరగడంతో కన్నీటి పర్యవంతం అవుతున్నాడు. రంగస్వామి పదెకరాల పొలాన్ని కౌలుకి తీసుకుని మొక్కజొన్న పంట వేసుకున్నాడు. చేతి కందాల్సిన పంట అకాల వర్షానికి నేలకొరగడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. దాదాపు రూ.3లక్షలు అప్పులు చేసి మరి పంట సాగు చేస్తే ఇలా జరిగిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ఎంతో కష్టపడి ఎంతో చెమటోడ్చి పంట సాగు చేస్తే చేతికి అందకపోగా ఇంతనష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

బుక్కరాయసముద్రం మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు నాయకులు

శింగనమల : మండల పరిధిలోని గోవిందరాయునిపేటలో రైతు శంకర్‌రెడ్డి సాగు చేసిన నేరేడు పంట శనివారం సాయంత్రం వీచిన గాలివానకు నేలమట్టమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు... శంకర్‌రెడ్డి తనకున్న 8.40 ఎకరాల పొలంలో 108 మామిడి, 180 నేరేడు చెట్లు సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో అకాల వర్షాల కారణంగా వడగండ్లు పడి చేతికొచ్చిన పంట పూర్తిగా ధ్వంసమైనట్లు వాపోయాడు. తద్వారా సుమారు రూ.1.48 లక్షలు నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా అకాల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్ర, శనివారాల్లో అకాల వర్షాలతో నియోజకవర్గంలో తీవ్ర పంట నష్టం సంభవించిందన్నారు. మండల కేంద్రంతోపాటు శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, సోదనపల్లి, గోవిందరాయునిపేట, పోతురాజుకాలువ, పెరవలి, తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పంట నష్ట అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన రైతులు ప్రభాకర్, ఎర్రిస్వామికి చెందిన దాదాపు 12 ఎకరాల్లో అరటితోట ధ్వంసమైంది. ప్రస్తుతం కాయ దశలో ఉన్న అరటి గెలలు రాలడం వల్ల పూర్తిగా నష్టపోయామని రైతులు వాపోయారు. ఫలితంగా దాదాపు రూ.12లక్షల నష్టం వాటిల్లినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గోవిందవాడ, దర్గాహొన్నూరు, బల్లనగుడ్డం, కల్లుహోళ, కళ్లు దేవనహళ్లి, బండూరు, గురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, లింగదహాల్, కృష్ణాపురం, కలగానహళ్లి, ఎల్బీనగర్ గ్రామాల్లో సాగు చేసిన మిరప, దానిమ్మ, అంజూర, బొప్పాయి, అరటి, మామిడి పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నార్పల : మండలంలోని కేసేపల్లి, కురగానిపల్లి, నడిమిదొడ్డి, వెంకటాంపల్లి, గడ్డంనాగేపల్లి, కర్ణపుడికి, పులసలనూతలతోపాటు పలు గ్రామాల్లో దెబ్బతిన్న బొప్పాయి, అరటి, మొక్కజొన్న పంటలను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు మాట్లాడుతూ అకాల వర్షంతో పలు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు లక్షల్లో నష్టపోయారన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పంట నష్టం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆర్డీవో మధుసూదన్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలోని మద్దలపలి, వెంకటాంపల్లి, కర్ణపుడిక, పులసలనూతల గ్రామాలకు వెళ్లి బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టం అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కాశెట్టి సంజీవరాయుడు, నియోజకవర్గ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ పలు గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుపాకుల భాస్కర్, విశ్వనాథ్ రెడ్డి, ఆకుల అశోక్, బాబా నజీర్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : అకాల వర్షాలకు మండలంలో దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలను టిడిపి, వైసిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ రైతులెవరూ అధైర్య పడవద్దని, పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యాడ్ వైస్ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, మడుగుపల్లి నాగేశ్వర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకులు మండలంలో దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న, చీనీ, దానిమ్మ, బొప్పాయి, తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు మాట్లాడుతూ అకాలంగా వడగండ్ల వాన కురవడంతో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారన్నారు. తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం జాబితాను తయారు చేసి బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆదినారాయణరెడ్డి, ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల, బొమ్మనహాల్ మండలాల్లో గాలివానకు నేలరాలిన మామిడి, చీనీ కాయలు

పుట్లూరులో నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో అనంత బాలికల జట్టుకు ప్రథమస్థానం

ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

ఉరవకొండ : కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగిన 33వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం జిల్లా బాలికల విభాగం జట్టు ప్రథమ స్థానం సాధించింది. క్వార్టర్స్ మ్యాచులో శ్రీకాకుళం జట్టుపై, సెమీఫైనల్స్ ప్రకాశం జిల్లా జట్టుపైన, ఫైనల్స్ మ్యాచ్ కర్నూలు జట్టుపై విజయం సాధించి మహిళా విభాగంలో మొట్టమొదటిసారిగా అనంత జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. దీంతో కర్నూలు జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, జూడో క్రీడా రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, నందికొట్కూరు నవనంది పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. జిల్లా జట్టు మొదటిసారిగా ప్రథమ స్థానం రావడంతో క్రీడాకారులతోపాటు సహాయ సహకారాలు అందించిన సిబ్బందికి సెపక్‌తక్రా సంఘం జిల్లా ఛైర్మన్ సప్తగిరి మల్లికార్జున, జిల్లా సంఘం బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జిల్లాజట్టుకు కోచ్‌లు, మేనేజర్‌గా నాగేంద్ర, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి సమర్థవంతంగా వ్యవహరించారని పీడీ మారుతీప్రసాద్ తెలిపారు.

నేడు ఎంకె జ్యువెల్స్ బోటిక్ ప్రారంభం

అధినేతలు హనీఫ్, కమాల్ అంజూం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక కమలానగర్‌లోని బాలకృష్ణ ఏజెన్సీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ఎంకె జ్యువెలర్స్ బోటిక్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు అధినేతలు హనీఫ్, కమాల్ అంజూం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఫ్రూట్స్ మండి ఓనర్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఎంకె జ్యువెలర్స్ బోటిక్‌లో మహానగరాల్లో లభించే అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రధానంగా వన్ గ్రామ్ టు గ్రామ్ గోల్డ్ ఆర్నమెంట్స్, ట్రెడిషనల్ గోల్డ్ కవరింగ్ ఆర్నమెంట్స్, టెంపుల్ జువెలరీ, విక్టోరియన్ జువెలరీ, బ్రైడల్ బ్యాంగిల్స్, రెంటేడ్ ఆర్నమెంట్స్ తదితర వివిధ రకాలైన మోడల్స్ అధునాతన మోడల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంకె జ్యువెలర్స్‌లోని వస్తువులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి - ఎమ్మెల్సీగా భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప - అనంతపురము - కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను సజావుగా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం ఎన్నికల్లో గెలిచిన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రం (సర్టిఫికేట్ ఆఫ్ ఎలక్షన్)ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం (కడప - అనంతపురము - కర్నూలు) ఎన్నికల పోలింగ్ ఈ నెల 13వ తేదీన నిర్వహించడం జరిగిందని, ఈ నెల 16వ తేదీన కౌంటింగ్ ప్రక్రియను మొదలుపెట్టి 18వ తేదీన పూర్తి చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వచ్చిన రిజల్ట్ షీట్‌ను, జరిగిన కౌంటింగ్ ప్రక్రియపై రిపోర్టును ఈసీఐ వరకు సబ్మిట్ చేయడం జరిగిందన్నారు. ఈసీఐ వారు రిజల్ట్ డిక్లేర్ చేయడానికి పర్మిషన్ శనివారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఇవ్వడం జరిగిందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలలో టిడిపి మద్దతుతో పోటీ చేసిన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి 1,09,781 ఓట్లు రాగా, 7,543 ఓట్ల మెజార్టీతో గెలిచారన్నారు. భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి గెలిచినట్లు ధ్రువీకరణ పత్రం (సర్టిఫికెట్ ఆఫ్ ఎలక్షన్) ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో కడప - అనంతపురము - కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలను పూర్తి చేసి, పోలింగ్, కౌంటింగ్ సాఫీగా పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టిడిపి రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు రెడ్డి, యువ నాయకులు పరిటా శ్రీరామ్, ఉమామహేశ్వరనాయుడు, ఆలం నరసానాయుడు, ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపు వైసిపికి చెంపపెట్టు : ఉన్నం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు ఉన్నం హనుమంతరాయచౌదరి

ఉత్తరాంధ్ర, రాయలసీమ తూర్పు, పశ్చిమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని ఆ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి వైసిపి ప్రభుత్వం పట్టభద్రులు, ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేసిందన్నారు. అంతేకాకుండా ఎన్నికల రోజు టిడిపి నాయకులను గృహనిర్బంధం చేసి తమ పైశాచికత్వాన్ని చాటుకుందన్నారు. అయినా అలాంటి వాటికి పట్టభద్రులు నెరవకుండా ఓటేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్నం మారుతీచౌదరి, పాపంపల్లి రామాంజినేయులు, ఆర్టీ శివశంకర్, డీకే.రామాంజినేయులు, రాయల శ్రీనివాసులు, కొల్లాపురప్ప, గోళ్ల వెంకటేశులు, గొర్ల గోవిందరాజులు, షామీర్, గౌని శ్రీనివాసరెడ్డి, రామన్న, మునీర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు తగిన గుణపాఠం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు టిడిపి అభ్యర్థిని గెలిపించి రాష్ట్రంలో వైసిపి నిరంకుశ పాలనకు తగిన గుణపాఠం చెప్పారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు సైకో జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి వైసిపి ప్రభుత్వం అనేక కుయుక్తులు పన్నినా విద్యావంతులైన యువత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. విద్యావంతులు ఓటును కొనేందుకు డబ్బు ఎరవేసినా తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టభద్రులు తమ విలువైన ఓటును టిడిపి బలపరిచిన ముగ్గురు అభ్యర్థులకు విజయాన్ని అందించారన్నారు. అందుకు పట్టభద్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి వైసిపి ప్రభుత్వం నీచంగా 5, 6, 7వ తరగతులు చదివిన అమాయక మహిళలను ఓటర్లుగా చేర్పించడం జగన్‌రెడ్డి సైకో పాలనకు నిదర్శనమన్నారు. నిరంకుశ పాలన అంతానికి బీజం పడిందన్నారు. అయితే ప్రతి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ విజయానికి పొంగిపోకుండా ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి జగన్ రెడ్డి అరాచక పాలనను ప్రజలకు తెలియజేస్తూ టిడిపి విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్‌గౌడు, మాజీ ఎంపిపిలు రాయల్ రామయ్య, ప్రతాప్‌నాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు కెసి.హరికుమార్, మస్తానప్ప, హనుమంతు, కేసప్పా, గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో 1ను రద్దుచేయాల్సిందే..

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎఐఎస్ఎఫ్ నాయకులకు నోటీసులు అందజేస్తున్న పోలీసు

జీవో 1ని రద్దు చేసేంత వరకూ ఉద్యమాలు ఆపే ప్రసక్తే లేదని ఎఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌నాయక్, కార్తీక్ అన్నారు. జీవో 1ను రద్దు చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న రాయదుర్గం ఎఐవైఎఫ్ నాయకులకు ఆదివారం రాయదుర్గంలోని రాణి సత్రం ప్రయివేటు బస్టాండ్ వద్ద పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-1 తీసుకొచ్చి సభలు, సమావేశాలు, నిరసనలు, ధర్నాలు నిర్వహించాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలని నిబంధన పెట్టడం బాధాకరమన్నారు. సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర, ఆందోళనలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత చేయకూడదని చెప్పడం బాధాకరమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన ఒక హక్కుగా దేశంలో ఎక్కడైనా సరే అన్యాయం జరిగితే నిరసనలు తెలిపే హక్కు ఉందన్నారు. ఈనేపథ్యంలో సంబంధిత జీవోను రద్దు చేయాలని చలో అసెంబ్లీకి బయలుదేరితే వెళ్లకూడదని నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వెంటనే జీవో-1ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. నోటీసులు తీసుకున్న వారిలో ఎఐవైఎఫ్ రాయదుర్గం మండల కార్యదర్శి అనీల్, కుబేర తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

2003-2004లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆత్మీయ కలయిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా 21 సంవత్సరాలు గడిచిన తర్వాత అప్పుడు విద్య నేర్పించిన ఉపాధ్యాయులతో కలిసి దాదాపు 108 మంది విద్యార్థులందరూ ఒకేచోట చేరారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అలనాటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎన్‌వి సుబ్బారెడ్డి, పిఇటి సుబ్బిరెడ్డి, శ్రీలక్ష్మి, శ్రీలత, సంధ్యారాణి, ఎంఇఒ మాధవ, గార్లదిన్నె గోపాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, రఫీ, అంజనప్రసాద్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి మిత్రుల ఆర్థికసాయం

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

నార్పల : పలువురు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మిత్రుని కుటుంబానికి ఆర్థికసహాయం చేసి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... మండల పరిధిలోని దుగుమర్రి గ్రామానికి చెందిన నరసింహులు స్వగ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్యతోపాటు నలుగురు పిల్లలు ఉన్నారు. వారం రోజుల క్రితం వ్యక్తిగత పని నిమిత్తం పుట్లూరు మండలం మడుగుపల్లి వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.50వేల మొత్తాన్ని మృతిచెందిన స్నేహితుని కుటుంబానికి అందించారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టిడిపి సంబరాలు

శింగనమల : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థిగా ఎన్నికైన భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయోత్సవ వేడుకలు సింగనమల మండలం లింగమ్మేపల్లి గ్రామపంచాయతీలో అనంతపురం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి గుమ్మేపల్లి గ్రామ సర్పంచ్ దేగల లలితమ్మల ఆధ్వర్యంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయోత్సవ వేడుకలు టపాసులు పేల్చి స్వీట్లు పంచడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన మూడు పట్టభద్రుల ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థులు ముగ్గురు అఖండ మెజార్టీతో గెలవడం ధన్యవాదాలుతెలియజేస్తున్నామని ముఖ్యంగా సింగనమల నియోజకవర్గం సింగనమల మండల పట్టభద్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అలాగే భూమిరెడ్డి గెలుపునకు పనిచేసిన తెలుగుదేశం నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు అని 2024 సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేయడానికి ఈ ఎన్నిక ఒక నిదర్శనమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-ఉరవకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి, ఎంపిపి

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు చేపడతామని సర్పంచి మీనుగ లలిత, ఎంపిపి చందా చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు ఆదివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఉన్న సర్పంచి ఛాంబర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో రానున్న ఉగాది, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి ఏ వార్డుకు ఏరోజు నీటి సరఫరా చేస్తామనేది కూడా వివరాలు తెలుపుతామన్నారు. కాగా పండుగలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు కూడా ప్రజల ఇబ్బందులను గమనించి సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెసిఎస్ మండల కన్వీనర్ ఆసిఫ్, కో అప్షన్ సభ్యులు పామిడి సలీమ్, వార్డు సభ్యులు పద్మావతి, శర్మస్, నాయకులు అన్వర్, ప్రకాష్, ఆటో సీనా, జోగి హనుమంతు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సోమవారం జిల్లాలో నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు డిఆర్‌ఓ బి.గాయత్రిదేవి తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు డిఆర్‌ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పని చేస్తున్న నేపథ్యంలో నేడు నిర్వహించనున్న స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు తెలిపారు. కావున ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.